డిటెక్టివ్ స్టోరీ

# విద్యుద్ఘాతము

ఎలక్ట్రాన్

**ఆ జిల్లా ముఖ్యపట్టణం జాతీయ రహదారి కిరువైపులా ఉంది. ఉత్తరపు పొలిమేరలో రహదారికి అరకిలోమీటరు దూరంగా 'పర్ణసి' అనే పాఠశాల ఉంది. దిగువ శిశు విద్యాతరగతుల నుంచి ఎదిగిన అమ్మాయిల యింటరు తరగతుల వరకూ ఆ పాఠశాలలో ఉన్నాయి. ఎగువ తరగతుల వారికి వసతి సౌకర్యం ఉపయోగించుకోవడం తప్పనిసరి. దక్షిణ పొలిమేరలో బాలురకోసమని సరిగా యిటువంటి పాఠశాలే 'ఉపల' ఉంది. ఈ రెండు పాఠశాలలూ మంథనా విద్యాసంస్థ వారివే.**

రాత్రి రెండవ ఆట సినిమా చూసి వచ్చిన రామకృష్ణ ప్రధాన ద్వారానికి పదడుగుల దూరంలో పిట్టగోడదూకి, వసతి గృహం రెండవ అంతస్తులో ఉన్న తన గది 212 చేరుకొని మెల్లగా తలుపుతట్టాడు. లోపల్నుంచి సమాధానమూ రాలేదు, తలుపూ తెరుచుకోలేదు. 'సాధారణంగా రాత్రి రెండింటి వరకూ రుబ్బితేనే కాని నిద్రపోని సుబ్బారావీ రాత్రి అప్పుడే పక్క ఎక్కేశాడేమిటి?' అనుకొంటూ, "సుబ్బారావూ, తలుపు తియ్యి" అంటూ తలుపు మీద గట్టిగా బాదాడు. సుబ్బారావు లేవలేదుకాని పక్క గదుల వాళ్ళు తలుపులు తీసుకొని బయటకు వచ్చారు.

211లోని నవీన్ రామకృష్ణతో అన్నాడు. "సుబ్బారావు రుబ్బి రుబ్బి, అలిసిపోయి ముసుగు తన్ని ఉంటాడు! ఒరేయ్ రామకృష్ణా! నీ సినిమాల సంగతి దేముడెరుగుకాని, వసతి పాలకుడు వీరభద్రానికి తెలిస్తే పేరు సార్థకం చేసుకొంటాడు! వచ్చి మా గదిలో రెండు మంచాల మధ్య చాప వేసుకొని పడుకో. రేపు ఉదయం సుబ్బారావు లేచిన తర్వాత నీ గదిలోకి వెళ్ళవచ్చు" అన్నాడు. ఆ మిగిలిన రాత్రి రామకృష్ణకు చాపేగతైంది.

మర్నాటి ఉదయం తొమ్మిది దాటిన తర్వాత పోలీసులు వచ్చి బద్దలు కొడితే కాని 212 గది తలుపులు తెరుచుకోలేదు. సుబ్బారావనే ఆ విద్యార్థి విగత జీవుడై పడి ఉన్నాడు. క్రైం బ్రాంచ్ ఇనస్పెక్టర్ రఘురాం రంగ ప్రవేశం చేశాడు. రఘురాం ఆదేశ ప్రకారం 'ఉపల' యాజమాన్యం సుబ్బారావు తల్లిదండ్రులకి కబురుతోపాటు కారుని కూడా పంపింది.

రఘురాం 212 గదిని సోదా చేశాడు. సుబ్బారావు, రామకృష్ణల బల్లల సొరుగుల్నీ, బట్టల గూళ్ళనీ, పుస్తకాల్నీ వెతికిచూశాడు. సుబ్బారావు బల్ల మీది టేబుల్ లాంప్ వెలుగుతూనే ఉంది. బల్ల మీద నున్న సీసాలో సగం నీళ్ళున్నాయి. బల్లమీద ఒకటీ, బల్లసొరుగులో ఒకటీ బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులున్నాయి. సుబ్బారావు నోటు పుస్తకాలన్నీ నల్లటి అక్షరాలతో రాయబడ్డాయి. సుబ్బారావు కెమిస్ట్రీ నోటు పుస్తకంలో పేజీల మధ్య ఓ రెండంగుళాల చదరపు కాయితం ఉంది. ఆ కాయితం మీది ముడతలు చూస్తే ఏదోవిప్పిన పొట్లాం తాలూకు కాయితంలా ఉంది. వేలిముద్రల కోసం గాలింపులూ, సుబ్బారావు మృతదేహానికి వివిధ కోణాల్లో ఫొటోలు తీయడమూ జరిగినతర్వాత, మృతదేహాన్ని శవ పరీక్షకి, అతని తాలూకు వస్తువులన్నింటినీ క్రైం బ్రాంచ్ ఆఫీసుకీ తరలించవల్సిందిగా ఉత్తర్వులిచ్చాడు. సుబ్బారావు కెమిస్ట్రీ నోటు పుస్తకాన్నీ, అతని బల్లమీదనున్న నీళ్ళ సీసానీ భద్రంగా ఓ కవరులో సీలు చేయించి, రామకృష్ణ బల్లమీద నిండుగా ఉన్న నీళ్ళ సీసాని మరో కవరులో సీలు చేయించి పంపించాడు.

రఘురాం విడివిడిగా చాలామందిని ప్రశ్నించాడు. వసతి గృహ నిర్వాహకుడు వీరభద్రం నియమాల్నీ, నిబంధనల్నీ ఏకరువు పెట్టాడు. ప్రధానోపాధ్యాయుడు రమేశం 'ఉపల' సాధించిన విజయాల్ని గురించీ, విద్యార్థుల క్రమశిక్షణకై పడే నిరంతర శ్రమగురించీ చెప్పాడు. మంథనా విద్యాసంస్థల యజమాని నరోత్తమదాసు తమ విద్యాసంస్థల లక్ష్యాన్ని గురించి వివరించాడు. అంతా ఓపికగా విన్న రఘురాం ఓ చిన్న ప్రశ్న వేశాడు. "మీరందరూ చెప్పింది విన్న తర్వాత – సుబ్బారావు చదువుల తాకిడికి తట్టుకోలేక, మానసికమైన ఒత్తిడికి గురై ఆత్మహత్యకి పాల్పడి ఉంటాడనిపిస్తోంది. ఏమంటారు?"

నరోత్తమదాసు కాస్సేపు మౌనం వహించి, ఆ తర్వాత నెమ్మదిగా అన్నాడు. "విద్యార్థులు ఆత్మహత్యలకి పాల్పడితే యిటు విద్యా సంస్థలల్నీ, అటు తల్లిదండ్రుల్నీ నిందిస్తున్నారు! యిది సాధారణమై పోయింది. భగ్నప్రేమలు కూడా కారణం కావొచ్చుగా?"

పక్కగదుల్లో ఉన్న విద్యార్థుల కథనం ప్రకారం రామకృష్ణకీ, సుబ్బారావుకీ కొట్లాట వరకూ కాదు కాని, వాగ్వివాదాలతో కూడిన ఘర్షణ తరచూ జరిగేది. రామకృష్ణ ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి పది దాటి చదవడు. అయినా మార్కులు బాగా వస్తాయి. తోటి విద్యార్థుల సందేహాలు చక్కగా తీరుస్తాడు. అందరితో చనువుగా ఉంటాడు.

"అతను రాత్రి చాలావరకూ చదవడమే మా వాగ్యుద్ధాలకీ, నేను రెండో ఆటో సినిమాలకి పోవడానికీ కారణం. నిన్న ఉదయం సుబ్బారావు చాలా సంతోషంగా కనిపించాడు. 'బోర్డు పరీక్షలైన వెంటనే ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయని తెలిసీ నువ్వింకా పైలా పచ్చీసుగా తిరుగుతున్నావ్! చూడు, నీకంటే ఎక్కువ రాంక్ తెచ్చుకొంటాను!' అన్నాడు. 212 గది ఓ వెలుగు వెలుగుతుందిలే అన్నానునేను.

'నిన్న మార్నింగ్ సెషన్ పూర్తయిన తర్వాత మధ్యాహ్నం మెస్‌కి భోజనానికి రాకుండా ఏదో పనుందని వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం క్లాసులకి రాలేదు. నిన్న రాత్రి ఇద్దరం కలిసి ఎనిమిది గంటల ప్రాంతంలో మెస్‌కి పోయి డిన్నర్ చేశాం. తిరిగి గదికి చేరిన తర్వాత తన టేబుల్ సొరుగుతీసి ఏదో నోటు పుస్తకం తీసి పేజీలు తిప్పాడు. తర్వాత రెండు మూడు నోటు పుస్తకాలు తీసి చూశాడు. తను పడుకొనే మంచం మీద పరుపు ఎత్తీ, టేబుల్ క్లాత్ ఎత్తీ దేనికోసమో చూశాడు. 'దేనికోసం వెతుకుతున్నావ్? ఏదైనా ప్రేమలేఖా?' అని

ప్రశ్నిస్తే, 'ఏదో ఒకటి, నీకెందుకు? ఏదైనా సినిమాకి పో!' అన్నాడు. 'సరే నీ ఏడుపేదో నువ్వేడు'. నువ్వు అన్నట్టుగా నేను సినిమాకి పోతున్నా' అని తొమ్మి దింటికి గది వదిలి వెళ్ళాను.

నేను సినిమాకి వెళ్ళినప్పుడు సుబ్బారావు తలుపు గడియ వేసేవాడు కాదు. ఒక వేళ వేసినా, నేను రెండో ఆటో సినిమా చూసొచ్చే సరికి యింకా మెలకువగానే ఉండేవాడు కాబట్టి, చిన్నగా తట్ట గానే తలుపు తీసేవాడు'' యిలా రామకృష్ణ చెప్పిన దంతా శ్రద్ధగా విన్నాడు రఘురాం. అతని మాటల్లో నిజాయితీ గోచరించింది. అయినా రామకృష్ణని తాత్కాలిక నిర్బంధంలోకి తీసుకొన్నాడు.



మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో రఘురాం కాస్త ఊపిరి తీసుకొనే సమయంలో 'పర్ణసి' ప్రధానోపాధ్యాయుని రాజమణి నుంచి టెలి ఫోను వచ్చింది. తమ స్కూల్లో సెకండ్ ఇంటర్ చదువుతోన్న వసంత అనే అమ్మాయి, దగ్గర్లోనే ఉన్న మామిడితోటలో ఓ చెట్టుకొమ్మకి చున్నీతో ఉరే సుకొని చనిపోయినట్లు తెలిపింది. రఘురాం తన బలగంతో వెంటనే అక్కడికి వెళ్ళాడు.

తోటకి మధ్యగా ఓ నుయ్యి ఉంది. ఆ నూతి మీదుగా దగ్గరగా ఉన్న ఓ మామిడి చెట్టు కొమ్మ పోతోంది. నూతిలో నీళ్ళులేవు. వసంత శవం నూతి లోకి వేళ్ళాడుతోంది. నూతిగట్టు మీద నిల్చుని, చున్నీతో కొమ్మకో ముడీ, మెడకో ముడీ వేసుకొని గెంతువేసి ఉండాలనుకొన్నాడు రఘురాం. పరిసరా లకీ, వేలాడుతోన్న దేహానికీ ఫొటోలు తీసిన తర్వాత, వసంత విగత శరీరాన్ని కిందకు దించారు. వసంత జుట్టు చెదిరి ఉంది. కుర్తాపై బొత్తాలు రెండూ తీసి ఉన్నాయి. లోపలి నల్లటి బ్రాసరీ హుక్ తీసి ఉంది. రఘురాం వసంత మెడని చున్నీముడిని విప్పి పరిశీలించి చూశాడు. వసంత చెప్పులు మామిడి చెట్టు మొదట్లో పడున్నాయి. నూతి గట్టు దగ్గర మట్టిలో ఏదో మెరుస్తూ కనబడింది. గులాబీ రంగులో ఉన్న ఓ ప్లాస్టిక్ పూస. చిట్లి ఉంది. దాన్ని జాగ్రత్త పరిచాడు. వసంత దేహాన్ని శవపరీక్షకి పంపి 'పర్ణసి' పాఠశాల ప్రాంగణానికి దారితీశాడు.

రాజమణి వణుకుతున్న స్వరంతో రఘురాంకి స్వాగతం పలికి, తన ఆఫీసురూంకి తీసుకు పోయింది. నరోత్తమదాసు కూడా అక్కడే ఉన్నాడు. అతని ముఖం చాలా ఆందోళనగా కన్పించింది.

''ఒకే విద్యాసంస్థకు చెందిన పాఠశాలల్లోని యిద్దరు విద్యార్థులు ఒకే సమయంలో మరణిం చడం మాకు విద్యుదాఘాతంలాంటిది! ఈ ఆత్మహ త్యలకి కారణం నిర్ధారించి మాకు అపప్రథ రాకుండా చూడండి'' అంది రాజమణి గాద్గది కంగా. ఆమె నుదుట శ్వేదబిందువులు స్పష్టంగా కనబడ్తున్నాయి. జాకెట్లో దోపుకొన్న చిన్న రుమాలు తీసుకొని నుదుటన అద్దుకొంది.

''మీకే కాదు, మా పోలీసులకీ చిక్కుముడి విప్పక పోతే అపప్రథే! వసంత యింటికి కబురు పంపించారా?''


''ఆమె తల్లిదండ్రులు దగ్గర ఊర్లోనే ఉంటారు. కారు పంపించాను''.

''సుబ్బారావు తల్లిదండ్రులతో, వసంత తల్లిదం డ్రులతో పత్రికా విలేకరులతో సహనం పాటించి మాట్లాడండి. మీరు నోరు జారితే ఊరూ, వాడా ఏకమౌతుంది. అమ్మాయిల వసతి గృహంలో వసంత గదిని చూసి వస్తాను'' అని రఘురాం లేచి వెళ్ళాడు. రఘురాం మాటల్లోని అర్థాన్ని వెదకసా గారు రాజమణి, నరోత్తమదాసులు.

వసంత ఉండే గదిని రఘురాం నిశితంగా పరిశీ లించాడు. రఘురాంకి వసంత బల్లసొరుగులో ఉన్న యింగ్లీషు నోటు బుక్కులో రెండు ఉత్తరాలు కనిపించాయి. అవి నిస్సహాయ పరిస్థితిని వ్యక్తం చేస్తూ, వ్యధాపూరితంగా రాసిన ప్రేమలేఖలు. తేదీలు వారం తేడాగా ఉన్నాయి. రెండు ఉత్తరా ల్లోనూ 'ఎస్' అన్న పొడిఅక్షరంతో సంతకముంది.

రఘురాం రెండు ఉత్తరాల్నీ ముక్కు దగ్గ రగా పెట్టుకొని వాసన చూశాడు. అరడ జను ఫొటోలు తీసిన తర్వాత వసంత పుస్తకాల్నీ, యితర వస్తువుల్నీ స్టేషన్‌కి తరలించాడు.

వసంతతో బాటు అదేగదిలో ఉండే మంజుల దూరంగా, వరండాలో భయాందోళనలతో నిలబడి ఉంది. రఘురాం మంజులను దగ్గరగా పిలిచి, ధైర్యం చెప్పి చాలా సౌమ్యంగా ప్రశ్నించాడు. ఆమె వలన చాలానే వివరాలు తెలిసాయి. క్రితం రోజు మధ్యాహ్నం మొదటి పిరియడ్‌లో కనకరావుగారనే కెమెస్ట్రీ లెక్చరర్ పాఠం చెబ్తున్న సమయంలో, ఆఫీసు అటెండెంట్ రాములమ్మ వచ్చి వసంతకి టెలిఫోన్ వచ్చిందని చెప్పింది. వసంత కనకరావు గారి అనుమతి తీసుకొని క్లాసు వదిలి బయటకు



వెళ్ళింది. వసంతనందరూ సజీవంగా చూడడం అదే చివరిసారి.

మంజుల ఆ సాయంత్రం స్కూలు ముగిసిన తర్వాత, తిరిగి రాని వసంత పుస్తకాలు కూడా గదికి తీసుకుపోయి ఆమె బల్లమీద ఉంచింది. మంజుల రాత్రి ఎనిమిదిన్నరకి మెస్‌లో భోజనం చేసి తిరిగి గదికి వెళ్ళింది. వసంత అప్పటికీ తిరిగి రాకపోయే సరికి, వసతిగృహ నిర్వాహకురాలు శ్యామలా దేవికి విషయం చెప్పింది. అత్యవసరమైన పిలుపు నందుకొని యింటికి కాని వెళ్ళిందేమోనని సరిపెట్టు కొన్నారు. ఫోను ఉన్న వసంత పెదనాన్న గారింటికి ఫోనుచేస్తే ఎవరూ ఎత్తకపోవడంతో చేసేదిలేక ఊరుకొన్నారు. ఈ రోజు మధ్యాహ్నం మామిడి తోటలో పుల్లలు ఏరుకోవడానికి కంచె దాటి వెళ్ళిన ఓ నడివయసు పల్లెటూరు స్త్రీ, చెట్టుకొమ్మకి వేలాడు తున్న శవాన్ని చూసి కేకలు వేసింది. కంచెకవత లగా కూతవేటు దూరంలో ఉన్న గుడిశెల్లోంచి జనాలు పరుగెత్తుకొంటూ వెళ్ళారు. ఆ కబురు చివరికి పాఠశాల చేరింది. రాజమణి ఆఫీసులో పని చేసే 'సరళ' అనే ఆవిడ అక్కడకు వెళ్ళి, వసంత మృతదేహాన్ని గుర్తించి, రాజమణికి తెలియ చేసింది. రాజమణి పోలీసులకి ఫోను చేసింది.

''వసంత మరీ అంత ఎక్కువగా చదివే రకం కాదు. మార్కులెప్పుడూ డెబ్భైల దరిదాపుల్లోనే. అప్పుడప్పుడూ పోస్టులో కవర్లొచ్చేవి. యింటి దగ్గ ర్నుంచి అనేది. కాని లోపలి ఉత్తరాలు లేతగులాబీ రంగు కాయితాలలో రాయబడ్డ కారణంగా అవి ప్రేమలేఖలని అనుకొంటాను. వసంత అమ్మగారు ప్రతి పదిహేను రోజులకీ ఆదివారం మధ్యాహ్నం వాళ్ళ ఊర్నుంచి వచ్చి, గది శుభ్రంగా సర్దిపెట్టేది. తినుబండారాలూ, ఉతికి యిస్త్రీ చేసిన దుస్తులూ తీసుకువచ్చేది. మాసిన బట్టలు తీసుకు వెళ్ళేది. వసంతకి వాళ్ళమ్మంటే కొంత బెదురుగా ఉండేది. అన్నీ సర్దుతుందన్న భయంతో ఆ ఉత్తరాల్ని ఒకటికి రెండుసార్లు చదివి చింపేసేది. ఓసారి ఓ ముక్క గాలికి ఎగిరి నాబల్ల మీద పడింది. అందులో 'నీ సుబ్బారావు' అని సంతకం ఉంది.

''రెండు రోజుల క్రితం వసంత నాతో 'ఎందుకే,

పరీక్షలంటే అంత భయపడిపోతావు? బోర్డు పరీక్ష లకేం, ఎలానూ మంచిమార్కులతో పాసై పోతాం. యింక ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలంటావూ, ఎవరో చాలా అనుభవం గల ప్రొఫెసర్ తయారుచేసిన ఓ మోడల్ పేపరు త్వరలోనే దొరకబోతోంది. దాంతో మనిద్దరం కుస్తీ పట్టామా, ర్యాంక్ గారంటీ!'



## మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

### బంగారు ఇటుకలు

"ఇప్పుడంటే యిలా వున్నాం గాని, మాద సలు జమీందార్ల వంశం తెలుసా" అంటూ లేని మీసాలు మెలేసుకున్నాడు కోసల్రావు.

"మీరు జమీందార్లేమో గాని, మా పూర్వీ కులు గద్వాల రాజుగారి వియ్యంకులు" అంటూ పల్లవి అందుకున్నాడు కోతల్రావు.

మందు దిగుతుంటే అందరూ ఫాంటసీ లోకంలో, గైడ్ లేకుండానే విహారయాత్ర ప్రారంభించారు.

"ఇంతకూ చేసిన గొప్ప పనులేమిట్లో చెప్పండి మరి" అంటూ చిరునవ్వు దాచుకు న్నాడు మందు ముట్టని టీ హోటలర్.

"అయితే, వినండి" అంటూ ఒక ప్రశ్నతో తన కట్టు కథ ముగించాడు 'రాజవంశీకుడు'.

'దేహీ' అంటూ వచ్చినవాళ్లను ఖాళీచేతుల్తో పంపటం మా రివాజు కాదు. ఒకసారి రాజు గారికి జబ్బుచేస్తే ఓ వృద్ధ వైద్యుడు వచ్చి చికిత్స చేశాడు. ఆ తర్వాత, సంతోషించిన రాజావారు "ఏం కావాలో కోరుకొమ్మని" శలవి చ్చారట. దురాశపరుడైన ఆ వైద్యుడు, ఒక అడుగు పొడుగు, ఆరంగుళాల వెడల్పు, మరో ఆరంగుళాల ఎత్తున్న బంగారు యిటుక కావాల న్నాడు. ఇచ్చినమాట తప్పటం వంశంలో లేని రాజావారు, వెంటనే ఖజానా నుండి ఓ యిటుక తెప్పించి, "ఇదిమీదే - అయితే, మీరు స్వయంగా మోసుకు పోవాలి. ఎవరి సాయమూ తీసుకోగూడదు" అంటూ ఓ షరతు పెట్టాడట.

"ఇంతకూ తీసికెళ్లాడా ఆ వైద్యుడు?" అని ప్రశ్నించారు మిత్రులు.

"జవాబు చెప్పాల్సింది మీరే" అంటూ గ్లాసు ఖాళీ చేశాడు రాజవంశీకుడు.

**ఆ సైజు బంగారు యిటుక మీరు మీసుకెళ్లగ లరా?**

సమాధానం: వీలు పడదు. 12"x6"x6" బంగారు యిటుక బరువు 300 పౌండ్లు. మామూలు వ్యక్తులు అంత బరువెత్తలేరు. ఇక వృద్ధుని సంగతి చెప్పనేల?

అంది". మంజుల చెప్పిన మాటలన్నీ విన్న రఘురాం ఆలోచనలో పడ్డాడు.

ఓ నిముషం ఆగి అడిగాడు. "ఈ విషయం నువ్వు ఎవరితోనైనా ప్రస్తావించావా?" మంజుల 'లేద'న్న సమాధానం యివ్వడంతో ఓ నిశ్వాసం విడి చాడు. వెంటనే మంజులని పుస్తకాలతో సహా జీప్ ఎక్కించి, వాళ్ళ యింటి వద్ద దిగబెట్టాడు. మంజుల తనతో ఏం మాట్లాడిందీ ఎవరికీ తెలియనివ్వవద్దనీ ఒకవేళ ఏ పత్రికల వాళ్ళైనా ఆరాలు తియ్యడానికి ప్రయత్నించినా, 'రూమ్మేటు మరణంతో వ్యాకు లంగా ఉందని సర్ది చెప్పి పంపి వేయండి అని మంజుల తల్లిదండ్రులకు హితవు చెప్పాడు.

రఘురాం ఆ తర్వాత చాలా పొద్దుపోయిన తర్వాత 'పర్ణసి' ఆఫీసులో రాజమణిని, నరోత్తమ దాసునీ చాలా ప్రశ్నలడిగాడు. అక్కడే వేచి ఉన్న సుబ్బారావు తల్లిదండ్రుల్నీ, వసంత తల్లిదండ్రుల్నీ ఓదార్చి, పత్రికా విలేకరులకు యిదమిత్థం కాని సమాధానాలిచ్చాడు.

రెండు రోజుల తర్వాత శవపరీక్షల, యితర పరీక్షల సమగ్ర సమాచారం అందింది రఘురాంకి. సుబ్బా రావు విషప్రయోగం వల్ల చనిపోయాడు. ఒక చిత్తు నోటుబుక్‌లో చనిపోయిన తేదీ రోజున సుబ్బారావు చేయ ప్రయత్నించిన కొన్ని ఫిజిక్స్ ప్రోబ్లెమ్స్ ఉన్నాయి. మొదట్లో బావున్నా, పోనుపోనూ దస్తూరీ చెడింది. అంటే అప్పటికి నిద్రమత్తు ముంచు కొచ్చింది. తర్వాత శ్వాస విడిచాడు. సుబ్బారావు బల్ల మీద నున్న నీళ్ళ సీసాలో ఆ విషం కలపబడింది. సుబ్బారావు నోటు పుస్తకంలో కనిపించిన పొట్లం కాయితాల మీద ఆ విషపు శేషాలు గుర్తించబడ్డాయి.

వసంతని ముందుగా ఎవరో గొంతుపిసికి చంపి, ఆ తర్వాత చున్నీతో వేలాడ దీశారు. కంఠం మీద బిగిసిన వేళ్ళ ఆనవాళ్ళతో సుబ్బారావువి కాని, రామకృష్ణవి కాని జత కుదరలేదు. మరణా నికి ముందు వసంతని ఎవరో అనుభవించడం జరి గింది. బలాత్కారపు చిహ్నాలు కనిపించలేదు. జన నేంద్రియంలో ఉన్న వీర్యం సుబ్బారావుది కావొచ్చు. ఆ విషయమై విస్తృత పరీక్షలు జరుపుతు న్నారు. గర్భనిరోధక మాత్రలనుపయోగించి నట్లుగా కూడా తేలింది.

వసంత నోటు పుస్తకంలో దొరికిన ప్రేమలేఖల లోని దస్తూరి, సుబ్బారావు నోటు పుస్తకాలలోని దస్తూరి సామాన్యులకి ఒకేలా కనిపించినా చేతి రాతల నిపుణుని అభిప్రాయం ప్రకారం అవి ఎంతో నైపుణ్యంతో రాయబడిన దొంగ ఉత్తరాలు. అక్షరాల సైజు ఒక్కటే అయినా గీతల మందంలో కొద్దిపాటి తేడా ఉంది. సుబ్బారావు బాల్‌పాయింట్ పెన్నులు 0.5 టిప్‌గలవి. ఉత్తరాలలో అక్షరాలు 0.6 టిప్‌తో రాయబడ్డవి. ఆ ఉత్తరాలు ఏనుగుమార్కు తెల్ల కాయితం మీద రాయబడినవి. ఆ దస్తూరి రామ కృష్ణదీ కాదు, అతను ప్రయత్నించినదీ కాదు.

రఘురాం ఆలోచనలో పడ్డాడు. యివి ఆత్మ హత్యలు కావు. వసంత మరణం విషయంలో సుబ్బారావు మీదకు అనుమానం కలగడానికి వసంత పుస్తకంలో దొంగ ఉత్తరాలుంచడం జరి గింది. వసంతను అనుభవించి, చంపి, తర్వాత సుబ్బారావు ఆత్మహత్య చేసుకొన్నట్టుగా జనం నమ్మాలి. ఉత్తరాలే సృష్టించబడినప్పుడు వాటిలోని విషయాలూ వాస్తవం కావు. అటువంటప్పుడు సుబ్బారావుకి ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం లేదు. డాక్టర్లు నిర్ధారించిన వసంత మరణ సమయంలో రామకృష్ణ మధ్యాహ్నం క్లాసులో ఉన్నాడు. అయితే సుబ్బారావు నీళ్ళ సీసాలో విషం కలపడానికి రామకృష్ణకి అవకాశం చాలా ఎక్కువ కానీ, బలమైన కారణం ఏమీ లేదు.

అంటే – వసంతను చంపిన వ్యక్తులకి సుబ్బా రావు వసంతను కలుసుకోడానికి మామిడితోపుకు వెడ్తున్న సంగతి తెలుసు. ఎలా? అదే... వసంతకి వచ్చిన టెలిఫోన్ కాల్ మరెవరో విన్నారు. హత్యా చేయవలసినంత కారణం ఆ సంభాషణలోనే ఉండి తీరాలి. 'నీ కంటే మంచి ర్యాంక్ సంపాదిస్తాను' సుబ్బారావు రామకృష్ణతో అన్నమాటలు, 'అపూర్వ మైన మోడల్ పేపరు దొరకబోతోంది' మంజులతో వసంత అన్నమాటలు. రెండురోజుల క్రితం మంజు లతో మాట్లాడుతున్నప్పుడు కలిగిన అభిప్రాయం యిప్పుడు బలపడింది.

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ముకుందంగారి గదిలో కూర్చుని, ఆయన పిలిపించినట్లుగా కనక రావుకి కబురంపాడు రఘురాం. స్టాఫ్‌రూంలో కూర్చుని కబుర్లు చెబ్తున్న కెమిస్ట్రీ లెక్చరర్ హడావు డిగా వచ్చాడు. భారీ విగ్రహం. కండలు తిరిగిన శరీరం. కనకారావు కుర్చీలో కూర్చోగానే రఘురాం ప్రశ్నించాడు. "మూడు రోజుల క్రితం అంటే ఫిబ్ర వరి యిరవై ఎనిమిదో తారీఖు మధ్యాహ్నం రెండింటి నుంచీ మీరెక్కడున్నారు?"

"తల నొప్పిగా ఉండి, మా కెమిస్ట్రీ హెడ్ అను మతి తీసుకొని యింటికి..." కనకరావు హఠాత్తుగా మాటమధ్యలో ఆపివేసి, పోలీసు దుస్తుల్లో ఉన్న రఘురాం కేసి భయం భయంగా చూశాడు.

రఘురాం చిన్నగా నవ్వి అన్నాడు. "చాలా మంది చేస్తున్న పనే మీరూ చేస్తున్నారు. ఊరంత టికీ తెలిసిన రహస్యాన్ని కప్పి పుచ్చుకొనే మీ ప్రయత్నం చూస్తేనే నవ్వూ వస్తోంది, జాలీ వేస్తోంది. మీరు 'పర్ణసి' పాఠశాలలో పాఠం చెబ్తో న్నట్టు హత్యగావించబడ్డ వసంత తప్ప మిగిలిన నలభై నలుగురు విద్యార్థినులూ సాక్ష్యమివ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వసంత మీ అనుమతి తీసుకొని వెళ్ళింది. చనిపోయింది ఆమేనని గుర్తుపట్టి మీరు కూడా ఓ సంతకం చేసేస్తే, ఈ రోజే దేహాన్ని వాళ్ళ తల్లిదండ్రుల కప్పగించడానికి వీలవుతుంది. ఏదో ఓ చిన్న ఫార్మాలిటీ, అంతే!"

రఘురాం మాటలు వింటూనే, 'యింతకాలానికి దొరికావురా కనకారావూ:' అనుకొన్నాడు ప్రిన్సిపాల్ ముకుందం. క్రమశిక్షణారాహిత్యం పేరిట కనకరావు మీద యాక్షన్ తీసుకోడానికి సాక్ష్యం లభించింది.

రఘురాంతో వెళ్ళి వసంతను గుర్తుపట్టక తప్ప లేదు కనకారావుకి. శవ పరీక్ష చేసిన డాక్టరు కనక

రావు వేళ్ళకీ, శవం మెడమీది గుర్తులకీ పొత్తు కుదిరందన్నాడు. రఘురాం వెంటనే కనకరావుని కస్టడీలోకి తీసుకొన్నాడు. తనొక్కడే మునగడం యిష్టం లేక కనకరావు నోరు విప్పాడు. క్రైం బ్రాంచ్ ఆఫీసుకి పోయి రాజమణిని వెంట బెట్టుకు రమ్మని మనిషిని పంపాడు. ఏం జరిగిందో తెలియని రాజమణీ, నరోత్తమదాసూ రఘురాం ఆఫీసులో హాజరయ్యారు.

ఏ విధమైన ఉపోద్ఘాతమూ లేకుండా, ''ఇప్పుడు చెప్పండి రాజమణి గారూ! మొన్న ఫిబ్రవరి 28వ తారీఖు మధ్యాహ్నం సుబ్బారావు టెలిఫోన్లో వసంతతో ఏం మాట్లాడిందీ?'' అని అడిగాడు.

''విద్యార్థినులకి ఒకసారి అనుమతినిచ్చిన తర్వాత ఎక్స్టెన్షన్ ఫోన్లో మాటలు వినేంతటి కుసంస్కారిని గాను!'' అంది రాజమణి జాకెట్‌లోని రుమాలు తీసి నుదుట మీద తుడుచుకొంటూ.

''పోనీ యిదే మీ రుమాలు సెంటువాసన వసంత పుస్తకాల్లో దొరికిన ప్రేమలేఖలకి ఎలా వచ్చిందో చెప్పండి! ఆ ఉత్తరాలు ఫోర్జరీలని మేం గుర్తించాం!'' రఘురాం తాపీగా అన్నాడు. రాజమణికి చెమటలు తుడుచుకోడానికి రుమాలు చాలలేదు.

ఏ సమాధానమూ రాకపోయే సరికి రఘురాం మాట్లాడ్డం మొదలు పెట్టాడు. ''తనకి ఇంజనీరింగ్ ప్రవేశపరీక్ష పేపరు లభ్యమైందనీ, వెంటనే పర్ణసి పాఠశాల వెనుకనున్న మామిడితోటకి రమ్మని సుబ్బారావు వసంతకి టెలిఫోను చేశాడు. ఆ మాటలు మీరు విన్నారు. ప్రతి ఏడులాగే లక్షల్లో చేతులు తడిపి మీరూ పేపరు సంపాదించారు. ఆ పేపరు ఆధారంగా పదీ, యిరవై ముప్ఫైశాతం నకిలీ ప్రశ్నలు చొప్పించి కొన్ని మోడల్ పేపర్లు తయారుచేసి, లోపాయికారీగా కొందరు విద్యార్థులకు, కొన్ని శిక్షణా సంస్థలకీ వివిధ ధరలలో అమ్మి సొమ్ము చేసుకొనే పథకంలో – సుబ్బారావు సంపాదించిన పేపరు మీ ఆదాయానికి గండి కొడ్తుందని భయపడి యింతటి దారుణానికి పూనుకొన్నారు!

''ఓ నిర్దిష్టమైన ప్రణాళిక లేక మీరు కనకారావుతో సహా మామిడితోట చేరుకొనే సరికి, సుబ్బారావు తన అవసరం తీర్చుకొని, వసంతకి పేపరు కాపీ నిచ్చి వెళ్ళిపోవడం జరిగింది. మీరు వసంత నుంచి బలవంతంగా పేపరు తీసుకొని, శాశ్వతంగా ఆమె గొంతు మూసేశారు! అక్కడ 'ఉపల' వసతి గృహంలో సుబ్బారావు, రామకృష్ణలు రాత్రి భోజనానికి వెళ్ళినప్పుడు, వీరభద్రం 212 గదిలో ప్రవేశించి, సుబ్బారావు సంపాదించిన పేపర్ని తస్కరించి, అతని నీళ్ళ సీసాలో విషం కలిపి, విషం పొట్లం కాయితాన్ని అతని ఓ పుస్తకంలో ఉంచాడు.

''వీరభద్రం సృష్టించిన దొంగ ఉత్తరాన్ని, మీరు పర్ణసి వసతి గృహంలో మంజుల రాత్రి భోజనానికి వెళ్ళినప్పుడు, ఆమె గదిలో ప్రవేశించి వసంత ఇంగ్లీషు నోటు పుస్తకంలో ఉంచారు. ఆ ఉత్తరాలు లీలగా వెదజల్లిన సెంటువాసనా, మీ రుమాలు సెంటువాసనా ఒక్కటే. వీరభద్రం బ్లాకులు చెయ్యడంలోనూ, ఫోర్జరీలు చెయ్యడంలోనూ సిద్ధహస్తుడు. అతనిదివరలో కోయంబత్తూరు దొంగ నోట్ల కేసులో యిరుక్కొని జైలు శిక్ష కూడా అనుభవించాడు. అంతటి సిద్ధహస్తుడూ బాల్‌పాయింట్ పెన్ విషయమై ఆలోచించని కారణంగా పొరపాటు చేసి, ఫోర్జరీ నిర్ధారణని సులభతరం చేశాడు. రామకృష్ణ కూడా పొరపాటున ఆ నీళ్ళు కనక తాగి ఉంటే, తనకే విధంగానూ వర్తించని మీ దారుణానికి బలైపోయే వాడు. వీరభద్రాన్ని కూడా కస్టడీలోకి తీసుకొన్నాం. రాజమణిగారూ! మీ కాలి చెప్పు పట్టీ మీది ఓ గులాబి రంగు పూస తెగి, మామిడి తోటలో బావిగట్టు పక్కన దొరికింది!''.

రాజమణి అప్రయత్నంగా తలవంచి పాదాల వైపు చూసుకొంది. నరోత్తమదాసు తలనెవరో రోట్లో (పర్ణసి) వేసి బరువైన పాత్రంతో (ఉపల) రుబ్బుతున్నట్లనిపించింది.

రఘురాం క్షమార్పణలు చెప్పుకొంటూ రామకృష్ణని విడుదల చేశాడు. ప్రశ్నాపత్రం సంపాదించడం కోసం సుమారు లక్ష రూపాయలు దాకా వెచ్చించిన సుబ్బారావు తండ్రి తను చేసిన తప్పుకి రెండు ప్రాణాలు బలై పోయాయని నెత్తీనోరూ బాదుకొన్నాడు. వసంత తల్లిదండ్రులు కూతురు ప్రాణం పోయినందుకు కాదు కానీ, శీలం చెడగొట్టుకున్నందుకు చింతించారు.

*

చిరునామా:
పి.వి.రమణరావు,
కేరాఫ్: డా. పి.గోపాల్
2-7-607, ఎక్సైజ్ కాలనీ, సుబేదారి,
హనుమకొండ - 506 001,
సెల్: 99496 94396

